క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాలలో ఎస్డీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేయనున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ధ్యానంతో ఆరోగ్యం

అర్వపల్లి : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జి వెంకటరంగారావు అన్నారు. అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. కార్యక్రమంలో అభ్యాసకులు వనం రమేష్, మనుబోతుల వీరయ్య, మేకల సత్యనారాయణ, అలువాల రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులను కలిసిన రాజగోపాల్‌రెడ్డి


అర్వపల్లిలో టీ తాగుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

అర్వపల్లి : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం తుంగతుర్తికి వెళ్లివస్తూ అర్వపల్లిలో కొద్దిసేపు ఆగి కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. టీస్టాల్‌లో టీ తాగారు. అలాగే మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావుతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, దరూరి యోగానంద చారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ పాస్టర్ల దినోత్సవం


బెతస్థ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో పాస్టర్లను సన్మానిస్తున్న క్రైస్తవులు

చివ్వెంల: మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలోని బెతస్థ ప్రార్థన మందిరంలో ఆదివారం ప్రపంచ పాస్టర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల చర్చిల పాస్టర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ దుర్గం ప్రభాకర్, హెప్సిబా, ఎడవల్లి యేసుపాదం, సురేష్, మిర్యాల కళింగరెడ్డి, పేతురు, బాబు, కిరణ్, సుధాకర్, భాస్కర్, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సూర్యాపేటలోని హెల్త్‌పై ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్యులు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యజమాని మతకాల చలపతిరావు, స్థానికులు పోలెబోయిన కిరణ్, వల్లాల రమేష్, గట్టిగొర్ల లింగమల్లు, బట్టమేకల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

లింగయ్య మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన ప్రజా కళాకారుడు వల్దాసు లింగయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన లింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, నెమ్మాది లక్ష్మి పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

చిలుకూరు : స్థానిక సంస్థల్లోనే కాకుండా బీసీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బహుజన వేదిక రాష్ట్ర కన్వీనర్ కస్తూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిలుకూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకే కాకుండా బీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు.

అధ్వానంగా లింక్ రహదారులు


రామన్నగూడెం-కుంచమర్తి లింక్‌రోడ్డు దుస్థితి


వేల్పుచర్ల-కాసర్లపహాడ్ రహదారి ఇలా..


కాసర్లపహాడ్-మర్రిబాయితండాల లింక్‌రోడ్డు

- పక్కా రోడ్లకు నోచుకోని పల్లెల అనుసంధాన రోడ్లు
- ఏళ్లు గడుస్తున్నా అదే పరిస్థితి
- బీటీగా మార్చాలని ప్రజల వినతి

అర్వపల్లి : గ్రామాల అనుసంధాన రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల లింక్‌రోడ్లు ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అనుసంధాన రహదారులను పక్కా రోడ్లుగా మార్చి తమ ఇబ్బందులు తీర్చాలని వివిధ గ్రామాల ప్రజలు అధికారులకు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని వివిధ గ్రామాల లింక్‌రోడ్లు అధ్వానంగా మారాయి.

లింక్ రోడ్లు సరిగా లేక..

జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామం నుంచి వేల్పుచర్ల, మర్రిబాయితండాలకు వెళ్లే అనుసంధాన రహదారులు అధ్వానంగా మారాయి. అలాగే రామన్నగూడెం-కుంచమర్తి మధ్య లింక్ రోడ్డు కంపచెట్లతో నిండి నీళ్లు పారుతూ కుంటలా మారింది. జాజిరెడ్డిగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లే లింక్‌రోడ్డు కూడా ఇలాగే ఇంది. అడివెంల నుంచి తిమ్మాపురం వెళ్లే లింక్‌రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఈదారిలో నిత్యం నడిచే రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తిమ్మాపురం నుంచి కందగట్లకు వెళ్లే లింక్‌రోడ్డు, అడివెంల నుంచి కోమటిపల్లికి, ఉయ్యాలవాడ రోడ్డు నుంచి కుమ్మరిగూడెం వెళ్లే లింక్‌రోడ్డు, కోడూరు నుంచి తాళ్లసింగారం, కొమ్మాల నుంచి మర్రిబావితండా, మేడిబావితండా, జాజిరెడ్డిగూడెం నుంచి పర్సాయపల్లికి వెళ్లే లింక్‌రోడ్లతో పాటు వివిధ గ్రామాల్లో 30కి పైగానే అనుసంధాన రహదారులు కంపచెట్లతో నిండి గుంతలమయమై అధ్వానంగా మారాయి. ఈ రహదారులు సరిగా లేక ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుండటంతో ఎన్నో వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా ఈ లింక్‌రోడ్లను పక్కా రోడ్లుగా మార్చి తమ కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాసర్లపహాడ్‌కు నిత్యం వెళ్తుంటాం



మా వేల్పుచర్ల గ్రామం నుంచి కాసర్లపహాడ్‌కు ప్రతిరోజూ పోస్టాఫీసుకు ఉపాధిహామీ బిల్లులు, పింఛన్‌ల కోసం వెళ్తాం. రెండు గ్రామాల మధ్య దారి కంపచెట్లతో నిండి గుంతలమయమై అధ్వానంగా ఉంది. ఈ దారిని పక్కారోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాం.

\- డెంకెల శంకర్, వేల్పుచర్ల

బురదమడుగులో నుంచి..



రామన్నగూడెం నుంచి కుంచమర్తికి వెళ్లే డొంక దారి నిత్యం నీటితో నిండి బురదమడుగులా ఉంటుంది. ఈదారిలో రెండు గ్రామాల ప్రజలతోపాటు రైతులు తిరుగుతుంటారు. బురదలో నుంచి నడిచి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నాం.

\- సాయమ్మ, రామన్నగూడెం

ఎటూ వెళ్లలేక పోతున్నాం



మా కాసర్లపహాడ్ గ్రామం నుంచి వేల్పుచర్ల, మర్రిబావి, మేడిబావి తండాలకు ఎటూ వెళ్లాలన్నా డొంక దారులే. ఈదారులను బీటీ రోడ్లుగా మార్చుటకు గతంలో ఎమ్మెల్యేలు శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇంతవరకు పనులు చేపట్టలేదు.

\- మచ్చ మధు, కాసర్లపహాడ్

దారులన్నీ తుంగతుర్తి వైపే..

- ఆర్డీఆర్ సంస్మరణ సభకు భారీగా హాజరైన ప్రజలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు


సంతాప సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన సర్వోత్తమ్‌రెడ్డి, తదితరులు

తుంగతుర్తి/ తిరుమలగిరి/ నాగారం : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలోని జాతీయ రహదారి 365 పక్కన ఉన్న మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అభిమానులే కాక ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. సభా ప్రాంగణానికి ఉదయం 8 గంటల నుంచే ప్రజలు, కార్యకర్తలు చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సమయానికి తానంచర్ల-నకిరేకల్ జాతీయ రహదారి, తుంగతుర్తి-నాగారం ప్రధాన రహదారి జనాలతో నిండిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంస్మరణ సభకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్ష వరకు జనం తరలివచ్చారు. దీంతో ప్రాంగణం మొత్తం కిక్కిరిసింది. ముఖ్యమంత్రి రాక కోసం జాతీయ రహదారి పక్కనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సభా ప్రాంగణానికి 1:36కు చేరుకొని దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్టేజీపై ఉన్న దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభ ప్రారంభం అయినప్పటి నుంచే ముఖ్యమంత్రి, మంత్రులు, ఆ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి గురించి మాట్లాడుతుండగా కార్యకర్తలు, అభిమానులు దామోదర్‌రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు ఇవ్వాలని, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని స్లోగన్స్ ఇచ్చారు.

భారీ బందోబస్తు..

తుంగతుర్తిలో జరిగిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంస్మరణ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు ముందు రోజు సాయంత్రమే తెలియడంతో అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేశారు. 1200 మందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును డీఐజీ చౌహాన్, ఎస్పీ నరసింహ దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నకిరేకల్-తానంచర్ల జాతీయ రహదారి వైపు నుంచి వచ్చే వాహనాలను దారిని మళ్లించారు.


దామోదర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, తదితరులు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, తదితరులు

దామోదర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దామోదర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చిన గొప్ప నాయకుడు దామోదర్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. అనంతరం దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు కూడా దామోదర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీరాంసాగర్ రెండవ దశ కాల్వకు బీఎన్ పేరే పెట్టాలి

తుంగతుర్తి : శ్రీరామ్ సాగర్ రెండో దశ కాలువకు బీఎన్ పేరు పెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలకు నీరు అందిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమై రైతులు సంతోషంతో వ్యవసాయాన్ని కొనసాగిస్తారని స్వర్గీయ భీమిరెడ్డి నరసింహారెడ్డి ఎంపీగా అనేకసార్లు పార్లమెంట్‌లో తన గళం వినిపించారని గుర్తుచేశారు. శ్రీరాంసాగర్ రెండవ దశ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో అనేకసార్లు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేసినట్లు తెలిపారు. శ్రీరామ్‌సాగర్ రెండో దశ నిర్మాణం చేపట్టడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైనదని అన్నారు. శ్రీరాంసాగర్ రెండవ దశకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు నామకరణం చేయాల్సి ఉండగా నేడు దామోదర్ రెడ్డి పేరు పెట్టాలనడం దురదృష్టకరమని విమర్శించారు. రుద్రమ చెరువును రిజర్వాయర్ చేసి దాని పేరు ఆర్‌డీఆర్‌గా పెడితే సంతోషపడతామని వామపక్షాలుగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. శ్రీరామ్ సాగర్ రెండో దశ కాలువకు బీఎన్ పేరే పెట్టాలని కోరారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నడిగూడెం : ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండాలో నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఆదివారం ఎక్లాస్‌ఖాన్‌పేట తండా ప్రాథమిక పాఠశాల ప్రహరీకి గ్రామానికి చెందిన బానోతు సైదా నాయక్ సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రంగులు వేశారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ తప్పనిసరి


విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేస్తున్న కరాటే మాస్టర్ రమణ, తదితరులు

సూర్యాపేట అర్బన్ : ప్రస్తుత సమాజంలో విద్యార్థిని, విద్యార్థులకు చిన్ననాటి నుంచే కరాటే శిక్షణ ఎంతో అవసరమని సీనియర్ కరాటే మాస్టర్ జేవీ రమణ(చిన్న) అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సుమన్ షాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే దూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం స్థానిక మినీ ట్యాంక్ బండ్‌పై బెల్టులు ప్రదానం చేసి మాట్లాడారు. కరాటే శిక్షణ ఆత్మరక్షణతో పాటు శారీరక దృఢత్వానికి తోడ్పడుతుందని తెలిపారు. నిత్యం చదువుతో సతమతమవుతున్న విద్యార్థులకు కరాటే శిక్షణ మానసికోల్లాసం కలిగిస్తుందని అన్నారు. అనంతరం కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు అక్షయ బ్రౌన్ బెల్ట్, విరాట్ పర్పుల్ బెల్ట్, జగన్నాథ్ సాయి బ్లూ బెల్ట్, అశృత్ ఆరంజ్ బెల్ట్, మహి, వర్షిత్ సంజయ్‌లకు ఎల్లో బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబల్ కృష్ణ, హాజీ పాషా, కరాటే మాస్టర్‌లు, కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ఆపద పొంచినట్లే..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి వెళ్లే దారిలో గ్రామ శివారు నందు శిథిలమైన కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలేర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ గుంతల వద్ద ఏ మాత్రం ఆదమరిచి వెళ్లినా పెద్ద ప్రమాదమే జరిగే పరిస్థితి నెలకొంది. ఈ గుంతల్లో గతంలో మట్టిపోయగా ఆ మట్టి కొట్టుకపోయి మళ్లీ గుంతలేర్పడ్డాయి. సంబంధిత అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

క్రాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన భానుపురి క్రాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

సూర్యాపేట : పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న టపాసుల దుకాణాలకు గాను భానుపురి క్రాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పిడమర్తి మధు, గౌరవ సలహాదారులుగా పాలవరపు రాజేష్, ధార పూర్ణచందర్, ఉపాధ్యక్షుడిగా జన్నపాల రాహుల్, కార్యదర్శిగా పోలోజు వినయ్, సహాయ కార్యదర్శిగా మాచర్ల ఉపేందర్, కోశాధికారిగా శిల్ప అజయ్, సహాయ కోశాధికారిగా కోసూరి సందీప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పిడమర్తి మధు మాట్లాడారు. దీపావళి సందర్భంగా ఎప్పటి మాదిరిగానే అధికారులు చెప్పిన స్థలంలో నిబంధనలకు లోబడి దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


నాగారంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్న గౌడ సంఘం నాయకులు

నాగారం : సూర్యాపేట జిల్లా కేంద్రంలో డిసెంబర్ రెండో వారంలో జరిగే గీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మొగుళ్ల మహేష్‌గౌడ్, బుర్ర ఎల్లాగౌడ్ కోరారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆహ్వాన సంఘం ఏర్పాటు కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎలుగూరి గోవిందు, జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

సూర్యాపేట : పట్టణంలోని ఠాగూర్ విద్యానికేతన్‌కు చెందిన 1996 -97 విద్యా సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమణ, పద్మరేఖ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డైనింగ్ హాళ్ల నిర్మాణం


పెన్‌పహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యలోనే నిలిచిపోయిన డైనింగ్ హాల్ నిర్మాణం


చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

- పాఠశాలలో ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- చెట్ల కిందే భోజనం చేస్తున్న విద్యార్థులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా భోజనశాలల నిర్మాణాలు చేపట్టారు. అయితే నిధుల కొరత కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా ప్రతి రోజు విద్యార్థులు చెట్ల కిందనే భోజనం చేయాల్సి వస్తోంది. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టింది. ఒక్కొక్క హాల్ నిర్మాణం కోసం రూ. 12.80లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. కాగా పెన్‌పహాడ్, గాజులమల్కాపురం ప్రభుత్వ పాఠశాలలకు డైనింగ్ హాళ్ల పనులు చేపట్టారు.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు..

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ప్రారంభించి బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం గోడలపై రేకులు అమర్చారు. అన్నారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. గాజులమల్కాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనులు మొత్తం పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అయినప్పటికీ నిరుపయోగంగా మారింది.

కోతుల దాడులు..

భోజనశాలలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంలో కోతులు బెదిరిస్తూ ప్లేట్లను ఎత్తుకుపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భోజనం చేసే సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు కాపలా కాస్తూ ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా భోజనశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెన్‌పహాడ్ మండలంలోని పాఠశాలలో భోజనశాలల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- నకిరేకంటి రవి, ఎంఈఓ

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కన్నెబోయిన వీరబాబు ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడటంతో రెండు కాళ్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదివారం వీరబాబును పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నడిగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, నాయకులు మేకల వీరబాబు, పుట్టపాక ఉదయ్, గుండు శ్రీనివాస్, ఎస్‌కే.మౌలానా, కన్నెబోయిన మురళీకృష్ణ, గంటెపంగు సైదులు, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ ఉన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

కోదాడ రూరల్ : హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న విశ్వజన కళామండలి 50వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సినీ గేయ రచయిత, విశ్వజన కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టార్జీ అన్నారు. కోదాడలో ఆదివారం నిర్వహించిన విశ్వజన కళామండలి, మూల వాసుల సంఘం నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్షికోత్సవానికి మానవతావాదులు, కళాకారులు, కళా అభిమానులు, కళా పోషకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం కళామండలి సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెపంగు రమేష్, గంధం పాండు, ఇస్మాయిల్, మాతంగి శైలజ, సురేష్, సైదులు, తిరుప్, ప్రసాద్, లీలా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


అర్వపల్లిలో బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. ఆదివారం అర్వపల్లిలో దుకాణాలు, ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డు రామలింగయ్య, వల్లపు గంగయ్య, డాక్టర్ రామకోటి, పొట్టిపాక సైదులు, దుబ్బాక ఎల్లంరాజు, మిర్యాల వెంకన్న, మెండె సురేష్, నున్న యాదగిరి, గణేష్, డాక్టర్ గడ్డం వెంకన్న, నున్న మహేష్, కృష్ణ, లింగయ్య, రాజు, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.